క్లుప్తంగా

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో గాయత్రీ విద్యార్థుల ప్రతిభ


రెడ్డి తేజశ్వని (466)


గుణుపురం శ్రావ్య (434)

బొండపల్లి: ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో గొట్లాంలోని గాయత్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ బి. మురళీ తెలిపారు. ఎంపీసీ విభాగంలో రెడ్డి తేజస్విని 466 మార్కులు, బైపీసీ విభాగంలో గుణుపురం శ్రావ్య 434 మార్కులు సాధించిందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అధ్యాపకులు, యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

'షైనింగ్ స్టార్'కు ఎంపికైన విద్యార్థినులు


కాకినాడ చరితశ్రీ


గేదెల పూజిత


సబ్బవరపు లిఖిత

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామం సమీపంలో గల మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కాకినాడ చరితశ్రీ, గేదెల పూజిత, సబ్బవరపు లిఖిత అవార్డుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. త్వరలో మంత్రి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ఉంటుందని, అలాగే రూ. 20 వేల నగదు బహుమతి అందిస్తారని చెప్పారు.

లెవిల్ క్రాసింగ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరికి వెళ్లే దారిలో ఉన్న లెవిల్ క్రాసింగ్ వద్ద శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లెవిల్ క్రాసింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సివిల్ డిఫెన్స్ సభ్యులు, సివిల్ ఇంజినీరింగ్ సిబ్బంది, రైల్వే భద్రతా సిబ్బంది పట్టాలు దాటే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజన్ సేఫ్టీ అధికారి ఎంకే సాహు, డివిజనల్ పీవే ట్రూనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కేవై రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వినియోగానికి దూరంగా మరుగుదొడ్లు


నిరుపయోగంగా దిష్టిబొమ్మల్లా ఉన్న మరుగుదొడ్లు

బొండపల్లి: గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రుపాయలు వెచ్చించి నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు ఎందుకూ పనికి రాకుండా గ్రామంలో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఒంపల్లి గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామానికి ముందు.. గ్రామం ఆవతల చెరువు గట్టుపైనా సుమారు 70 వరకు సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు అయితే నిర్మించారు గాని, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించకపోవడంతో వినియోగించడానికి వీల్లేకుండా మారాయి. దీంతో లక్షలాది రూపాయలు వృథా అయ్యాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

రహదారి పనులు ప్రారంభం

పూసపాటిరేగ: మండలంలోని ఎస్ఎంఎస్ పరిశ్రమ నుంచి కొవ్వాడ అగ్రహారం పురాతన శివాలయం వరకు సుమారు రూ.25 లక్షల సొంత నిధులతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఎస్ఎంఎస్ పరిశ్రమ నుంచి కొవ్వాడ అగ్రహారం శివాలయం కలుపుతూ 2 కిలోమీటర్ల పొడవులో 40 అడుగుల వెడల్పుతో రహదారి పనులకు సర్వే పూర్తి కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. కొవ్వాడ గ్రామ సర్పంచ్ కోట్ల రఘు సొంత నిధులు సుమారు 25 లక్షలతో రహదారి పనులు సాగుతున్నాయి. రహదారి నిర్మాణంతో వ్యవసాయ భూములు మధ్య రవాణా సులభతరం కావడంతో పాటు వ్యవసాయ భూములకు ప్రాముఖ్యత పెరుగుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి


గంట్యాడ: ఎంఈఓ విజయకుమారికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘ ఐక్యవేదిక నాయకులు


గరివిడిలో ఎంఈఓ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

గంట్యాడ: ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు జేఆర్సీ పట్నాయక్, తిరుపతినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎంఈఓ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్జీటీలకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారని, ఇప్పుడు మళ్లీ వెబ్ ఆప్షన్ పెట్టుకోమంటున్నారని తెలిపారు. దీనిపై 9వ తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బి. శివప్రసాద్, ఆర్. రామకృష్ణ, సత్యనారాయణ, నారాయణరావు, రమణ, మురళీమోహన్, గోపాలరావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా నిరసన..

గుర్ల (గరివిడి): ఎస్జీటీ బదిలీల్లో మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు గొర్లె పద్మావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు గరివిడి మండల కేంద్రంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు శనివారం ఆందోళన చేశారు. వెబ్ కౌన్సెలింగ్ వల్ల ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారన్నారు. అధికారులు మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. అనంతరం ఎంఈఓ రామారావుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మీసాల వెంకటరమణ, పీఆర్‌టీయూ నాయకుడు గోపి ఉన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన..

గుర్ల: మండల పరిధిలోని ఎస్జీటీలు స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఎస్జీటీలకు మాన్యువల్ పద్ధతిలో బదిలీలు చేపడతామని హామీ ఇచ్చి.. నేడు వెబ్ ఆప్షన్ ద్వారా మాత్రమే కౌన్సెలింగ్ చేపడతామని ఉత్తర్వులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతూ ఎంఈఓ ఎస్.భానుప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. వెంకటరావు, ఎం. సత్యనారాయణ, మోహన్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలువురు స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆదివారం డీఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు.


గుర్ల: ఎంఈఓ భానుప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుర్ల ఉపాధ్యాయులు


ఎస్.కోట: ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఎస్జీటీలు

వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్


వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి, తదితరులు

గజపతినగరం: వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో గజపతినగరం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. మట్టి నమూనా పరీక్షల ఫలితాల ప్రకారం ఎరువులు వేసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయాధికారులు సూచించిన పంటలనే సాగు చేయాలని చెప్పారు. ప్రభుత్వం 80 శాతం రాయితీపై డ్రోన్ పరికరాలు అందిస్తోందని.. వీటి సాయంతో సాగు ఖర్చు తగ్గించుకోవాలని తెలిపారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఏజెన్సీ (గిరిజన) ప్రాంత రైతులకు ప్రత్యేక వాహనాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, వ్యవసాయశాఖ జేడీ వి.టి రామారావు, వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్, నాయకులు కొండపల్లి భాస్కరనాయుడు, గంట్యాడ శ్రీదేవి, జానకీరామ్, ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేతనదారుల నిరసన


ముషిడిపల్లిలో నిరసన తెలియజేస్తున్న వేతనదారులు

శృంగవరపుకోట: మండలంలోని ముషిడిపల్లి పంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ మా శ్రమను దోచుకుంటున్నారని పలువురు వేతనదారులు ఆరోపించారు. ఈ మేరకు పని మానేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేట్లు, వేతనదారులు మాట్లాడుతూ.. తాము ఆరు రోజులు పనిచేస్తే ఐదు రోజులు.. ఐదు రోజులు పనిచేస్తే మూడు రోజులే మస్తర్లు వేసి అన్యాయం చేస్తున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ కుమారుడు విశాఖలో ఉంటున్నప్పటికీ, ఇక్కడ 98 రోజులు పనిచేసినట్లు మస్తర్లు వేసి సొమ్ము తీసుకున్నారని ఆరోపించారు. వారికి నచ్చిన గ్రూప్ సభ్యులకు రూ. 250 చొప్పున, నచ్చని వారికి 160 రూపాయల చొప్పున వేతనం వేస్తున్నారన్నారు. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను తొలగించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆటలకు దివ్యాంగులు ముందుకు రావాలి


పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు

లక్కవరపుకోట: పారా స్పోర్ట్స్ ఆడేందుకు దివ్యాంగులు ముందుకు వచ్చి, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం తన స్వగృహంలో పారా స్పోర్ట్స్ చైతన్యయాత్రకు సంబంధించిన పోస్టర్లను పారా స్పోర్ట్స్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.దయానంద్‌లతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జీఓ 4 ద్వారా విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు చెప్పారు. పారా స్పోర్ట్స్‌లో రాణించిన క్రీడాకారులకు కోట్లాది రూపాయల ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే విశాఖపట్నంలో 22 ఎకరాల్లో క్రీడా మైదానాన్ని నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శీతల్‌మాదాన్, పూసపాటి ప్రతాప్‌వర్మ, శివలింగ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా క్రీడా మైదానం


క్రీడా మైదానంలో విచ్చలవిడిగా వేసిన వ్యర్థాలు

- పట్టించుకోని అధికారులు..


గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలు

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వ్యర్థాల డంపింగ్ యార్డుగా మారిపోయింది. పాఠశాలకు సుమారు నాలుగు ఎకరాల క్రీడా మైదానం ఉంది. కొత్తవలస పట్టణంలో ఏ ప్రభుత్వ సభలు, సమావేశాలు నిర్వహించాలన్నా ఈ మైదానమే దిక్కు. విజయనగరం – కొత్తవలస రోడ్డును ఆనుకుని ఉన్న ఈ మైదానంలో ఇటీవల కొంతమంది వ్యక్తులు ట్రాక్టర్లతో వ్యర్థాలను తీసుకువచ్చి వేసేస్తున్నారు. ఈ రహదారి మీదుగా నిత్యం జిల్లా, మండల స్థాయి అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ ఈ అక్రమ డంపింగ్‌పై ఏ ఒక్క అధికారీ పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికే మైదానంలో కొంతప్రాంతం ఆక్రమణకు గురైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైదానంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఆక్రమణలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పూసపాటిరేగ : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి ఎస్.ఇందుమతి అన్నారు. మండలంలోని కుమిలి గ్రామంలో గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను విద్యార్థులు పఠనం చేసి విజ్ఞానం సంపాదించాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంటు కృష్ణసాయి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు అంతరాయం..

బొండపల్లి: ఏపీ ఈసేవ ద్వారా అందిస్తున్న పది రకాల సేవలకు ఈ నెల పదో తేదీ వరకు అంతరాయం కలగనుందని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధాయ ధ్రువపత్రాలు, భూముల మ్యుటేషన్, రైస్ కార్డులు, తదితర సేవలను ఏపీ ఈ సేవ పోర్టల్ ద్వారా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని ఎస్. బూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు అన్ని పత్రాలూ కలిగి ఉండాలన్నారు.

మారికలో అంధకారం

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ మారిక గిరిజన గ్రామంలో మూడు రోజులుగా అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, అధికారులు స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ సూరిబాబు వద్ద ప్రస్తావించగా.. సిబ్బంది పంపించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

మద్యం షాపులపై నిరంతర పర్యవేక్షణ

చీపురుపల్లి: చీపురుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న 19 మద్యం షాపులపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు సీఐ చక్రవర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 19 మద్యం షాపుల పర్యవేక్షణకు 'ఎక్సైజ్ ఐ' అనే యాప్‌ను వినియోగించడంతో పాటు సిబ్బందిని కేటాయించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరు వ్యాపారం చేసినా చర్యలు తప్పవన్నారు.

పరామర్శ..

గుర్ల: మండలంలోని కెల్లకు చెందిన టీడీపీ నేత కె. సాంబశివరాజు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబశివరాజు కుమార్తె విమలారాణికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు , బెల్లాన బంగారునాయుడు, వరదా ఈశ్వరరావు, బోళ్ల సుబ్రహ్మణ్యం, తోట తిరుపతిరావు ఉన్నారు.


సాంబశివరాజు చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

కనులపండువగా వేణుగోపాలస్వామి కల్యాణం


లక్కవరపుకోట మండలంలోని కళ్లెంపూడిలో గల సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం శనివారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఏడువాక శ్రీనివాసరావు దంపతులు, జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, బెహరా పట్టాభిరామారావు దంపతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. – లక్కవరపుకోట

కాశీవిశ్వేశ్వరుడి సన్నిధిలో జెడ్పీ చైర్మన్..


గరివిడి మండలం రేగటిలో కాశీ విశ్వేశ్వరుని ఆలయ ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు కె. రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. – గుర్ల (గరివిడి)

ఘనంగా బక్రీద్


రామవరం మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

గంట్యాడ: త్యాగానికి ప్రతీక అయినా బక్రీద్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. రామవరం గ్రామంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో..

శృంగవరపుకోట: పట్టణంలోని ముస్లింలు బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. జామియా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మతగురువు ఆఫీక్ అహ్మద్, మౌజంతస్లీమ్ ఖాన్, షేక్ అలీఖాన్, షేక్‌నయాబ్రసూల్, షేక్ మదీనా, షేక్ నవజీర్, షేక్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.


ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

రామాలయ ప్రారంభోత్సవం..


హోమంలో పాల్గొన్న భక్తులు

గుర్ల: మండలంలోని కొండగండ్రేడులో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 100 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సారిక గోవింద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.